


# కాంతి

రచన: "శివం"

కాంతి!

ఇదివరకెన్నడూ ఎరుగనట్లు కన్పించే కాంతి! మెత్తగా నురగలాగ 'హోరైజన్' నుంచి నేలకు జారిపోయే కాంతి.

సన్నగా ఎక్కడో మూలుగు. ఏమిటా మూలుగు? ఎక్కడ తను?

బాధగా కళ్ళు మూసుకున్నయి. గుండెల్లో ఏదో చిక్కటి మంట. ఎందుకిట్లా తను బాధపడటం? తను మందు తీసుకుంటే బావుణ్ను.

మెత్తని బూట్లచప్పుడు. మృదువుగా దగ్గరనుంచే ఎవరో అంటున్నారు. "ఫర్వాలేదమ్మా, అట్లా కళ్ళనీళ్ళు తెచ్చుకుంటే ఎట్లా? గండం గడిచినట్లె, టెంపరేచరు 'నార్మల్'కి వచ్చింది."

కళ్ళు తెరిచాడు నెమ్మదిగా అతను. ఎదురుగా లక్ష్మణరావు వున్నాడు. తనింట్లో ఎందుకున్నాడు యితను? మంచం మీదే పడుకుని వున్నాడు. ముఖం పీక్కుని పోయింది పాపం. జబ్బుపడ్డాడు కాబోలున్న.

నర్సు వచ్చి లక్ష్మణరావు మంచం దగ్గర నిలబడి అతని టెంపరేచర్ తీసుకుంటూంది. అంత నీరసంలోను అందమైన ఆ నర్సును చూడగానే తనలో విపరీతమైన కోరికలు!

డాక్టరువచ్చి 'ఎట్లావుంది మెర్సీ! టెంపరేచరు తగ్గిందా?' అని అడిగే సరికి తాను హాస్పటలులో వున్నట్లు ధృడంగా తేలిపోయింది.

అవును. తనని హాస్పటలులో పారేసేరు!

ఎదురుగుండా లక్ష్మణరావు దగ్గుతో వుక్కిరి బిక్కిరి అవుతూ 'స్పిట్టూన్' అందక నసుగుతున్నాడు.

చాలా వంటరిగా, బాధగా ఎట్లాగో వుంది మనస్సంతా. నుదుటి మీద చెయ్యివేసుకు చూసుకున్నాడు. చేతికి నుదురు కాలిపోతున్నట్లన్పించింది. సీత ఏమయింది? మంచం దగ్గిర కన్పించడం లేదు. అవును అస్తమానం కూర్చుంటుందా యిక్కడ, తన బాధ చూస్తూ!

లక్ష్మణరావు భార్య ఎంతో ఆదుర్దాగా 'స్పిట్టూన్' అందుకని భర్త నోటి వద్ద ఎత్తి పట్టుకుంది. కళ్ళని అందులో వుమ్మి, వక్క క్షణం ఆయాసంతో కళ్లు మూసుకుని, లక్ష్మణరావు చెయ్యెత్తి భార్య నెత్తిమీద వక్కటి తగిలించి, 'వుక్కిరి బిక్కిరి అయి చస్తూంటే చూస్తూ కూర్చుంటావా లం...' అన్నాడు,

ఆమె కిమ్మనలేదు. ఎంతో ఓర్పుతో కన్నీళ్ళని ఆపుకుంటూ ముందుకి వంగి 'స్పిట్టూన్'ని నేలమీద పెట్టి 'సోడా నీళ్ళిమ్మంటారా?' అడిగింది.

లక్ష్మణరావు వగరుస్తూ, వోబూతు పదం ప్రయోగించి, అక్కరలేదని చెప్పి గోడకి జార్లబడి కూర్చున్నాడు.

వెంకటేశ్వర్రావు బాధగా కళ్ళు మూసుకున్నాడు. కమిలిపోయే ఆ యిల్లాలి ముఖం చూడలేక పోతున్నాడతను.

మూసుకున్న కండ్లలోనే 'బ్రూట్' అనుకున్నాడు అతను. బ్రూట్ నిజంగా బ్రూట్! ననిగేడు తను. ఇంట్లోపనులన్నీ చక్కబెట్టుకుని, యిక్కడ మళ్ళీ భర్తకి సపర్యలు తక్కువ అవుతాయేమోనని వచ్చిన భార్యని అంత జ్వరంలోను పశువులా నిందిస్తాడూ యీ బోడి భర్త! మళ్ళీ యింట్లోవుంటే భార్య భోజనం చేసిందో లేదో కూడా కనుక్కోరీ గొప్ప భర్తలు!

వెంకటేశ్వర్రావుకి వక్క క్షణం ఆలోచనలు ఆగేయి. వెంటనే అతని మూసుకున్న కండ్ల ఎదుట అంబోతు వకటి కన్పించింది. దాని ముఖానికి తన ముఖానికి వున్నట్లు కుడివైపున నుదిటి దగ్గర చిన్న గాయమయింది. క్రమంగా దానికి తనలాగే వుంగ్రాల క్రాపు వుండటం కన్పించింది. నిదానంగా చూస్తే తన ముఖమే దానికి!

భయంతో కండ్లు తెరిచేడు వెంకటేశ్వర్రావు. లక్ష్మణరావు గ్లాసులోని కాఫీ తాగుతున్నాడు. అతని భార్య పక్కనే నిలబడి చల్లగా విసన కర్రతో నెమ్మదిగా విసురుతోంది.

మగవాడికి వున్నంత కోపం ఆడదానికే వుంటే యిద్దరి బతుకులు ఏమయిపోయేవో! భూదేవికి కూడా లేని సహనం వీళ్ళకి ఎక్కడినుంచి వస్తుందో!

తనకి నోరెండి పోతున్నట్లుంది. కొంచెం మంచి నీళ్ళిస్తే బావుణ్ను ఎవరన్నా! ఈ నర్సు ఏమయి పోయింది.? తన సీత ఏమయి పోయింది యింత వరకు? తను గొంతు యెండి చచ్చిపోతాడు కాబోల్ను యిలాగే. ఎవర్నీ పిలవడానికి తనకి శక్తి కూడా లేకుండా వుంది. ఏమయి పోయింది తన శక్తంతా. ఆ పక్కనుంచి యీ పక్కకి తిరగగలడా తనసలు! నెమ్మదిగా ప్రయత్నించి తిరిగేడు ఎడమ పక్కకి. గుమ్మంలో కూర్చునివుంది సీత ఏదో పుస్తకంలోని బొమ్మలను చూస్తూ.

అతనికి అంత నీరసంలోను విపరీతమైన కోపమొచ్చింది. తనక్కడ చావడానికి సిద్ధంగావుంటే అదేదో పుస్తకం చూసుకుంటుంది. తను చస్తే హాయిగా యింకొకడిని పెళ్ళి చేసుకుంటుంది కాబోల్ను. చేసుకోనీ, తనిట్లా దిక్కు

లేని చావు చస్తాడు. ఈ సమయంలో అమ్మవుంటే ఎంత బావుణ్ను. తనకోసం ప్రతి క్షణం గిలగిల లాడిపోదూ? తనెప్పుడు చస్తాడా అని కాబోలు్న ఆ ఆలోచన. ఆ దిగులు, దానికి. తనంత తొరగా చావడులే. డి. యమ్. ఓ. శాస్త్రిగారుండగా తను చావడు.

కండ్లెత్తి తనవైపు చూస్తోంది. తను వింతగా ఏదో సౌంజ్ఞ చేస్తున్నాడు తనకి తెలియకుండానే. ఏదో కరిగి తనలో జారిపోతోంది ఎక్కడికో. తన స్పృహ తప్పిపోతూన్నట్లుంది.

తనకి మళ్ళీ స్పృహ వచ్చేసరికి తన భార్య విసురుతూ, చమట తుడుస్తూంది. ఆదుర్దాగా ఆమె గ్లూకోజుడబ్బా అందుకుని నీళ్ళల్లో కలిపి చంచాతో తన మంచం వద్ద బెరుకుగా నిలబడింది. కండ్లతోనే కూర్చోమన్నట్లు సౌంజ్ఞ చేసేడు అతను.

ఆమె మంచం చివరన కూర్చుని చంచాతో గ్లూకోజ్ నీళ్ళు తన నోట్లోకి అందించ సాగింది.

తనిక చావడు. ఆభయం లేదు ఇక. పూర్వంలా తలలో ఏదో ఎగిరి పోతున్న 'సెన్సేషన్' లేదిప్పుడు.

చేతిని నోటి కడ్డుపెట్టుకుని ఇక చాలన్నట్లు సంజ్ఞచేసేడతను. సీత నెమ్మదిగా గ్లాసును చిన్న బల్లమీద వుంచి తన ముఖంమీది చెమటను తుడిచి విసర సాగింద.

ఆమె ముఖాన్నే చూస్తు పడుకున్నాడట్లా తను. కండ్లు రెండూ ఎర్రగా వున్నాయి...సీతకి. నిద్రలేదా లేక ఏడుస్తుందా?

కండ్లు రెండూ మూసుకున్నాడతను. తేనెటీగలు తుట్టెనుంచి కదిలినట్లు కదులుతున్నాయి ఎవ్వేవో ఆలోచన్లు. తన శక్తి సగం యీ అర్థంలేని ఆలోచనలతోటి, 'Repressions' తోటి నశించిపోతోంది. అవును. తన యీరోగానికి కారణం కూడా యీ యెడతెగని ఆలోచనలే. మెదడుఒక్కక్షణం 'Blank'గా సిరంగా వుండక పోవడానికి కారణమేమిటో?

కండ్లుతెరిస్తే విచారంగాతనవంకచూసే సీత! కండ్లుమూస్తే, క్రాఫింగ్ వున్న ఆంబోతు. ఆంబోతు తనలానే వంకరగా నవ్వుతోంది. కొంపతీసి తనేకాదు కదా ఆ ఆంబోతు!' ఛీ! ఛీ!

ఆ ఆలోచనని పక్క తన్ని తన్ని వేరే యేదో ఆలోచించ బోయాడు. ఆలోచన వచ్చింది. సీత కిటికీ దగ్గర నిలబడి యేడుస్తూన్నట్లు కన్పించింది తనకి. ముఖాన్ని అటు తిప్పుకొని నిలబడివుంది. యెందుకేడుస్తుంది?

యెవరో నిలవేసి అడుగుతున్నారు. 'యెవరు బ్రూట్! నేనా? నువ్వా బ్రూటువి! రోజూ ఒంటిగంటకి కొంపకొచ్చే నువ్వా బ్రూటువి. భార్యకి జబ్బుగా వుంటే కొంపని కూడా చూడకుండా హోటలులో భోజనం చేసిన నువ్వా బ్రూటువి. నేను బ్రూటునిట! ఈయన చాలా పెద్దమనిషైనట్లు.

చీకట్లో ఆముఖం కనపడటం లేదు. దగ్గరలో యేమీ కనపడటం లేదు, చాచి ముఖం పగిలేటట్లు కొడదామంటే.

యెక్కడనుంచో వెక్కి వెక్కి ఏడుపు. చటున కండ్లు తెరిచాడతను. యెదురుగా సీత శాంతంగా విసురుతూనే వుంది. అవతల గదిలో కాబోలున్న యెవరో రోగి బాధతో యేడుస్తున్నట్లు న్నాడు.

యెందు కొస్తాయో యీరోగాలూ, బాధలూ! ఆలోచనల్లాగే యివీ తప్పని సరి కాబోలు ప్రతి జీవికీ.

సీత కండ్లు తుడుచు కుంటూంది— వక్కక్షణం విసరడం ఆపి. బహుశా చెమటను తుడుచు కుంటూన్నట్లుంది. యేడవడానికి యేముంది?

తన జబ్బు తగ్గిపోయినట్లే. ఇక అది యింటికి పోవచ్చు. ఇంకో గంట ఆగి దాన్నింటికి వెళ్ళమని చెబుతాడు తను. నయమవ్వక యేమవుతుందీ వెధవ జబ్బు డి. యమ్. ఓ. తనని స్వయంగా చూస్తూంటే!

హోమియోపతి డాక్టర్ని కూడా పిలిపించ డానికి బద్ధకించాడు తను, సీతకి మలేరియా వస్తే అదే తగ్గిపోతుందిలే అని వూరుకున్నాడు — మూడు రోజులు. ఆడాళ్ళకి అసలు జబ్బులేమిటి అనుకునే వాడతను. వాళ్ళు పుట్టింది వంటపన్లు, యింటిపన్లు చెయ్యడానికి గాని జబ్బులు తెచ్చుకోడానికా? యేదో మామూలు జ్వరం అదే తగ్గిపోతుందిలే అని వూరు కున్నాడు. అసలు 'జ్వరమా' అని కూడా కనుక్కో లేదు తను. ఇంటి కొచ్చేసరికి పడుకొనివుంది ఆపూటకి వంట చేసేసి.

తను వడ్డించుకు తినాల్సి వచ్చినందుకు చిరాకు పడుతూ గబగబా భోంచేసి, బట్టలు మార్చుకొని 'కనన్'తో కల్సి సినిమా కెళ్ళాడు ఆరాత్రి.

ప్రొద్దున్నే 'పక్కయింటి వాళ్ళతో వండిపెట్టమని కాస్త చెప్పకూడదూ!' అని భార్యమీద మండి పడ్డాడు. అంత జ్వరంలోనూ ఆమెలేచి పక్కవాళ్ళని బ్రతిమాలి వంట చేయించింది. ఆరోజు తనకి స్నానానికి వేణ్ణీళ్ళు లేవు. వెధవ బతుకు అనుకుని చన్నీళ్ళ స్నానంచేసి అకోపంతో భోజనం అన్నా సరిగా చేయక ఆఫీసుకు వెళ్లిపోయేడు. వారం రోజులు నరకంలా గడిచింది. ఆదెంత బాధపడిందో తనొక్క మాటన్నా మాట్లాడనందుకు? పైగా పక్కింటివాళ్లు హోమోపతి డాక్టరుని పిలిపించేరని తను మండిపడ్డాడు. ఇంతాచేసి పాపం 10 రూపాయలు కూడా చార్జీ చెయ్యలేదా డాక్టరు.

ఆ క్రాఫింగ్ అంబోతు తనే! లక్ష్మణరావు కన్న పశువులా హీనంగా ప్రవర్తించేడు తను. ఒక్క క్షణం ఏదో పుస్తకం చూస్తూ కూచుందని అసహ్యంగా అనుకున్నాడు సీతను గురించి తను! పాపం యీ ఆడవాళ్ళకి యీ ఓర్పు లేకపోతే తనవంటి భర్తల గతి యేమయి వుండేదో!

కండ్లు తెరిచేడు వెంకటేశ్వరరావు. సీత తనవంకే చూస్తూ యింకా అట్లాగే

విసురుతూ తనేమైనా అంటాడేమో అన్నట్లు భయంతో 'ఫ్లాస్కులో కాఫీ వుంది...యిమ్మంటారా?' అడిగింది.

మలినంగా, హీనంగా వచ్చిన చిరునవ్వుతో వెంకటేశ్వర్రావు 'ఊఁ' అన్నాడు.

అట్లాగే పడుకుని వున్న వెంకటేశ్వర్రావు గొంతులో కాస్త చొప్పున కాఫీని పోస్తూ 'యెట్లావుంది?' అడిగింది సీత.

ఫర్వాలే అన్నట్లు తలూపుతూ, చేతిని యిక వద్దని వూపి కండ్లు మూసుకున్నాడు. లోపల్నుంచి పొగలు! విసరమని చెయ్యివూపి, చల్లగా గాలి తగులుతుంటే కండ్లు తెరిచాడు.

సీత విసురుతూ యేమేమో ఆలోచిస్తోంది, తనవైపే చూస్తూ.

ఆతని హృదయం యేదో ఆనందంతో నిండినట్లయ్యింది, వక ఆలోచనతో. నెమ్మదిగా ఆమె చేతిని తన చేతిలోనికి తీసుకుని 'భోంచేసేవా?' హీనంగా అడిగేడతను.

సీత తలతిప్పుతూ 'ఫర్వాలే. నా భోజనానికేం తొందర లేదిప్పుడు. ఆకలి వెయ్యడం లేదు' అంది బెదురుగ్గానే.

ఉండుండి లక్ష్మణరావు కాబోలున్న అరవ సాగేడు. "అవును నేను చస్తా. అదేగా నీ కోరిక. హాయిగా ఆ డాక్టర్తో లేచిపోదుగాని, నేనిక్కడ నీరసంతో చస్తూంటే అటు చూస్తావేమే లం__! నేను చావాలనేనా! ఆస్తంతా నీదే! వాడూ నువ్వూ కల్సి విషం పెట్టేయండి." వెంటనే విపరీతమైన దగ్గు.

వెంకటేశ్వర్రావు కండ్లలో సీతకి దివ్య హర్మ్యం కన్పించిందొకటి. అందులో తనూ ఆయనా కలతల్లేని జీవనం!

సీత కండ్లలో యేం చూశాడో వెంకటేశ్వర్రావు, వెచ్చగా ఆమె చేతిని చిన్న నొక్కుమాత్రం నొక్కుదా మనిపించిం దాతనికి ఆ ఆనందంలో.

కండ్లు మూసుకున్నా ఆకాశంనుంచి నేలకు మెత్తగా నురగలాగ జారిపోయే వింత కాంతి.

